సాక్షి
వికారాబాద్

మంగళవారం । 21 । నవంబర్ । 2023



'పోటె'త్తిన యువత

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో వారం మాత్రమే ప్రచారం చేసేందుకు అవకాశం ఉంది. 10లో▸



అద్దంలాంటి రోడ్లు

గ్రామాల్లో అద్దం లాంటి సీసీ రోడ్లను నిర్మించామని షాద్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్ అన్నారు. 10లో▸



ఓడినా ప్రజల్లోనే..

నిత్యం ప్రజల మధ్యే ఉన్న మా నాన్నను ఆదరించాలని కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య చేతన్ కోరారు 10లో▸

న్యూస్‌రీల్

అన్ని స్థానాల్లో గెలుస్తాం

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



బైక్ ర్యాలీలో ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లికి చెందిన క్రీడాకారుడు గోపాల్‌రెడ్డి తన సహచరులతో కలసి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎంపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు క్రీడాకారులు నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి బీఆర్‌ఎస్ పథకాలు అందాయని పేర్కొన్నారు. నేడు తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. బీఆర్‌ఎస్ వెంటే ప్రజలు ఉన్నారని, తమ నాయకులు ఎక్కడికి వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని తెలిపారు. కార్యక్రమంలో శివారెడ్డిపేట పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, నాయకులు షఫీ, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి శ్రీనివాస్



మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన శ్రీనివాస్

వికారాబాద్ అర్బన్: ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ జెడ్పీటీసీ గొట్టిముకుల శ్రీనివాస్ సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో హస్తం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లపాటు బీఆర్‌ఎస్‌లో ఉంటూ పార్టీ కోసం ఎంతో కృషి చేశానని తెలిపారు. కేవలం ముదిరాజ్ అనే ఉద్దేశంతో ఎమ్మెల్యే తనకు గుర్తింపు ఇవ్వలేదని ఆరోపించారు. అనేక సార్లు ఎమ్మెల్యే అవమానించినా పార్టీని వీడలేదన్నారు. పొమ్మనకుండా పొగ బెట్టినట్లు తెలిపారు. తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతోనే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్‌లు అంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మోమిన్‌పేట్ మాజీ జెడ్పీటీసీ నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న వరప్రసాద్‌రెడ్డి

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడిగా వెల్దండ మండలం చౌదర్‌పల్లికి చెందిన సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డిని నియమించారు. ఆమనగల్లులోని ఐక్యతా ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థి డా.వంశీకృష్ణ చేతులమీదుగా వరప్రసాద్‌రెడ్డి నియామక పత్రం అందుకున్నారు. వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, కల్వకుర్తి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో సోమవారం స్టేట్ టీచర్స్ యూనియన్ షాద్‌నగర్ డివిజన్ శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో.. ఎస్టీయూ ఫరూఖ్‌నగర్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా నారాయణ(జెడ్పీహెచ్‌ఎస్, బూర్గుల), ప్రధాన కార్యదర్శిగా సతీష్ (జెడ్పీహెచ్‌ఎస్, కుంట), జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా శంకర్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఫరూఖ్‌నగర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వికారాబాద్ అర్బన్: ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

లెక్క తప్పొద్దు

తప్పుడు లెక్కలు చూపితే గెలిచినా వేటు తప్పదు

- ఓటర్లను ప్రలోభపెడితే కేసులు నమోదు చేస్తాం
- సీ – విజిల్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తాం
- ఎన్నికల చివరి 48గంటలపై మరింత నిఘా
- ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోండి
- కలెక్టర్ నారాయణరెడ్డి

తాండూరు టౌన్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పుడు ఖర్చులు చూపితే చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అభ్యర్థులు చేస్తున్న ఖర్చులపై వ్యయ పరిశీలకులు ఆధ్వర్యంలో నిఘా టీంలు పని చేస్తున్నాయని తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్నవారు రోజు వారి ఖర్చుల వివరాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. తప్పుడు లెక్కలు చూపితే ఎన్నికల కమిషన్ అభ్యర్థిపై అనర్హత వేటు వేస్తుందని వివరించారు. ఓటర్లను మద్యం, డబ్బు, తాయిలాలతో ప్రలోభపెడితే సీ–విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు సూచించారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో దర్యాప్తు పూర్తి చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 70 వరకు ఫిర్యాదులు అందాయని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించామని పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ప్రచారానికి అనుమతి ఉందన్నారు. 30వ తేదీ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్‌కు 48గంటల ముందు నుంచి నిఘాను తీవ్రతరం చేస్తామన్నారు. జిల్లాలోని 1,133 పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. 9.60 లక్షల మందికి ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే 50శాతం పైగా పంపిణీ పూర్తయిందని తెలిపారు. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సైతం వారి ఇళ్ల వద్ద స్లిప్పులు అందజేయనున్నట్లు తెలిపారు. ఓటు వినియోగించుకునే విధానాన్ని తెలియజేస్తున్నామని వివరించారు. 21, 22, 23 తేదీల్లో ఎన్నికల సిబ్బందికి రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్కడే వారికి పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 7వేలకుపైగా పోస్టల్ బ్యాలెట్లు అందాయన్నారు. అలాగే 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ఈ నెల 23, 24వ తేదీల్లో వారి వద్ద నుంచి ఓటును స్వీకరిస్తామన్నారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని కోరారు.

పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దు

వికారాబాద్ అర్బన్: ఇలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు వారి విధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ముఖ్యమైన ఘట్టం కౌంటింగ్ అని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది పూర్తి అవగాహన తోపాటు సమయస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కించాలని ఆదేశించారు. ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిగి మార్కెట్ యార్డులో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ అక్కడే జరుగుతుందని చెప్పారు. ఈవీఎంలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. రాండమైజేషన్ తర్వాత కౌంటింగ్ సెంటర్లను కేటాయించడం జరుగుతుందని, కేటాయించిన సెంటర్‌కు సిబ్బంది సకాలంలో వెళ్లాల్సి ఉంటుందన్నారు. దూరప్రాంతాల్లోని సిబ్బంది ఒకరోజు ముందుగానే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని ఆదేశించారు. ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి, డీపీఓ తరుణ్ కుమార్ భూగర్భ జల వనరుల శాఖ అధికారిని దీపా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- ఎస్పీ కోటిరెడ్డి

తాండూరు టౌన్: ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోటిరెడ్డి ఆదేశించారు. సోమవారం తాండూరు డీఎస్పీ కార్యాలయ ఆవరణలో డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటర్లు, సిబ్బంది సెల్‌ఫోన్లు, వీడియో రికార్డర్లు, కెమెరాలను తీసుకెళ్లకుండా చూడాలని ఆదేశించారు. రూట్ మొబైల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఇతర అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. సున్నిత, అతి సున్నితమైన గ్రామాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల్లో పర్యవేక్షించాలన్నారు. ఏదైనా సంఘటన జరిగితే ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటరు ఓటు వేసేలా చూడాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్పీ శేఖర్‌గౌడ్, పట్టణ, కరన్‌కోట సీఐలు రాజేందర్‌రెడ్డి, రాంబాబు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

కాంగ్రెస్ పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి



అవ్వా బాగున్నవా.. వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న టీఆర్‌ఆర్

పరిగి: తన హయాంలో ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని డీసీసీ అధ్యక్షుడు, పరిగి అభ్యర్థి టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిగురాల్‌పల్లి, మిట్టకోడూర్, గోవిందపూర్, లక్నాపూర్, రుకుంపల్లి, బర్కత్‌పల్లి, నస్కల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక్క సారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దశాబ్దకాలంగా ప్రజలు పడుతున్న బాధలు తనకు తెలుసని, వారికి అండగా ఉంటానని పేర్కొన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే చిరుగాల్‌పల్లి వంతెన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా అర్హులందరికీ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అందేలా చూస్తానని తెలిపారు. నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ అధిష్టానం ఆరు గ్యారంటీలను తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలు వస్తాయని అంటున్న బీఆర్‌ఎస్ మాయమాటలను ప్రజలు నమ్మవద్దని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడ చూసినా సీఎం కేసీఆర్‌పై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అలా చేయలేదని, నిరుపేదలకు భూములను ఇచ్చిన ఘనత మా పార్టీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో 43వేల ఇందిరమ్మ ఇళ్లను ఇస్తే బీఆర్‌ఎస్ ఒక్కరికైనా డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసిందా అని ప్రశ్నించారు. దగాకోరు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలకు దింపాల్సిన సమయం వచ్చిందని, పేదల పార్టీ కాంగ్రెస్‌ని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యాహరిశ్చందర్, పరిగి వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పూడూరు పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సుదర్శన్

అత్యధిక కేసులు పరిష్కరిద్దాం

- ఆ దిశగా న్యాయవాదులు చొరవ చూపాలి
- జిల్లా కోర్టు ప్రిన్సిపల్ న్యాయమూర్తి సుదర్శన్
- డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

వికారాబాద్ అర్బన్: డిసెంబర్ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, మోటారు యాక్సిడెంట్ నష్ట పరిహారం కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని వికారాబాద్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ కే సుదర్శన్ సూచించారు. సోమవారం కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, వికారాబాద్ న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రమాద బీమా కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారం కోసం ఇన్సూరెన్స్ కంపెనీలు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులను కూడా రాజీ మార్గంలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో రాజీ అయితే కట్టిన కోర్టు ఫీజును తిరిగి ఇవ్వడం జరుగుతుందని ఈ విషయాన్ని కక్షి దారులకు తెలియజేయాలన్నారు. రాబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ పడే విధంగా న్యాయవాదులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, న్యాయసేవా అధికార సంస్థ జిల్లా కార్యదర్శి కే శ్రీకాంత్, జూనియర్ సివిల్ జడ్జి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సి'విజిలేస్తున్నారు!

సామాన్యుల చేతిలో బ్రహ్మాస్త్రం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తీసుకొచ్చిన సి–విజిల్ యాప్ సామాన్యుల చేతిలో బ్రహ్మాస్త్రంలా మారింది. అడ్డదారుల్లో ఎన్నికల్లో గెలుపొందేందుకు అభ్యర్థులు చేస్తున్న ప్రయత్నాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతోంది. ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ భావించింది. ఆ మేరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు సి–విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడే వారి వివరాలతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బ్యానర్లు, పోస్టర్లు, నిర్దేశిత సమయం తర్వాత చేస్తున్న ప్రచారాలు, మద్యం, పంపిణీకి సంబంధించిన ఫిర్యాదుల వీడియోలను సామాన్యులు తమ స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారులు ఆ ఘటనా స్థలానికి చేరుకుని అక్రమార్కులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

అభివృద్ధికే పట్టం కట్టండి

- కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేద్దాం
- వికారాబాద్ అభ్యర్థి మెతుకు ఆనంద్

మర్పల్లి: సంక్షేమ పథకాలు అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఆ పార్టీ వికారాబాద్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. సోమవారం కొంషెట్‌పల్లి, మొగిలిగుండ్ల, పట్లూర్, ఘనపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. ఆయన్ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. మరోసారి తనను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం రాక ముందు, వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధిపై చర్చించి ఓటు వేయాలని కోరారు. పట్లూర్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. అయితే ఒకరికొకరు ఎదురు పడకుండా మర్పల్లి పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. కాంగ్రెస్ నాయకుల ర్యాలీని కొంత సేపు ఆపేశారు. అనంతరం బీఆర్‌ఎస్ ర్యాలీ యధావిధిగా సాగింది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మధు కర్, డీసీసీబీ మాజీ డైరక్టర్ ప్రభాకర్ గుప్తా, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరక్టర్ గౌస్, సహకార సంఘం డైరక్టర్ యాదయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొంషెట్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

సభలు.. యమ కాస్ట్లీ గురూ..

- ఒక్కో మీటింగ్‌కు రూ.2 కోట్ల వరకు ఖర్చు
- అన్ని పార్టీలదీ అదే బాట
- మందు, విందు, రవాణా, డబ్బు ఇవ్వాల్సిందే
- కొన్ని సార్లు ఖర్చు చేసినా రాని జనం
- ముఖ్యనేతలు వస్తే ఖర్చులు మరింత పెరిగే అవకాశం

వికారాబాద్: ఎన్నికల సభలు, సమావేశాలు ఇప్పుడు బాగా కాస్ట్లీ అయ్యాయి. ఒకప్పుడు తమ ప్రాంతానికి అభిమాన నాయకులు, నేతలు వస్తే చూడటానికి, అతను చెప్పే మాటలు వినేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వెళ్లేవారు. ఎవరూ పిలవకుండానే సొంత డబ్బు పెట్టుకొని సభలు, సమావేశాలకు ఎగబడేవారు. సమావేశాలకు హాజరయ్యే జనాన్ని బట్టి ఆ పార్టీ, ఆ నేత బలాబలాలు అంచనా వేసేవారు. ప్రజల నుంచి వచ్చే స్పందనే గెలు పోటములను నిర్ణయించేవి కూడా. ఇదంతా గతం.. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.అభిమాన నేతల స్పీచ్‌లు వినాలనుకుంటే ఇప్పుడు సమావేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. చేతిలో సెల్‌ఫోన్, ఇంట్లో టీవీ ఉంటేచాలు సమావేశం మొత్తం ప్రత్యక్షంగా చూడొచ్చు. దీంతో ప్రజలు సభలు, సమావేశాలకు వెళ్లడం చాలావరకు తగ్గించారు. దీంతో డబ్బులు ఖర్చు చేసి జన సమీకరణ చేయడం పార్టీలు, అభ్యర్థులకు తప్పనిసరిగా మారింది.

ఎంత ఖర్చు చేస్తే అంత సక్సెస్

నేడు సభలు, సమావేశాల నిర్వహించడం మారుతున్న పరిస్థితికి అద్దం పడుతోంది. మీటింగులు ఎంత సక్సెస్ అయ్యాయనేది ఆ సభలకు ఖర్చు చేసిన డబ్బులపైనే ఆధారపడుతోంది. జిల్లాలో ఇటీవల జరిగిన సభలు, సమావేశాలు, రోడ్ షోలకు ఒక్కో దానికి రూ. 1.5 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. పార్టీ ఏదైనా ఒక వ్యక్తి సమావేశానికి రావాలంటే అతని చేతి ఖర్చులకు రూ. 300 నుంచి రూ. 500 వరకు ఇవ్వాల్సిందే. కొన్ని సందర్భాల్లో డబ్బు తోపాటు రవాణా ఖర్చులు, మద్యం, భోజనం కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సగటున ఒక వ్యక్తిని సమావేశానికి తీసుకురావడానికి రూ. 500 ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఓవరాల్‌గా పదివేల మందితో సమావేశం నిర్వహిస్తే రూ. కోటి నుంచి కోటిన్నర వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇటీవల కొన్ని సభలు, రోడ్ షోలకు 20 వేల మంది వరకు జనాలను తరలించారు. ఈ లెక్కన ఒక్కో సభకు రూ. రెండు నుంచి రూ. మూడు కోట్లు ఖర్చు చేసినట్టు ఆయా పార్టీల నేతలే చెబుతున్నారు. కొన్ని చోట్ల 30 నుంచి 40 వేల జనాలను సమీకరించేందుకు ప్లాన్ చేస్తే 10 నుంచి 20 వేల మంది కూడా రావడం లేదు. జిల్లాలో ఇటీవల జరిగిన ఓ రోడ్ షోలో 30 వేల మందిని తరలించేందుకు ఆ పార్టీ ఖర్చు చేస్తే కేవలం 10వేల లోపే హాజరు కావడంపై ఆ పార్టీలో చర్చనీయాంశం అయ్యింది.



ఇటీవల జిల్లాలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రోడ్‌షోకు హాజరైన జనం

స్పీచ్‌లతో ప్రభావితం చేయాలనే..

రేవంత్‌రెడ్డి, కేటీఆర్, హరీశ్‌రావు, కేసీఆర్, రాహుల్, సోనియా వీరందరినీ కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరంలేని నేతలు.. వీరి హోదాలు,పార్టీలతో సంబంధం లేకుండా వీరి పేరు చెబితే చాలు 90శాతం జనం గుర్తు పడతారు. అయితే వీరిని తీసుకువచ్చి సమావేశాలు నిర్వహించడం, వీరితో మాట్లాడించడం నేడు రాజకీయాల్లో ట్రెండ్‌గా మారింది. వీరితో మాట్లాడిస్తే వారి స్పీచ్‌లతో జనం ప్రభావితం అవుతారని, అభ్యర్థుల గెలుపోటములను కూడా వారి స్పీచ్‌లు నిర్ణయిస్తా యని నమ్ముతున్నారు.దీంతో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ఈ స్టార్ క్యాంపేయినర్లను తీసుకొ చ్చేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్య ర్థులు పోటీ పడుతున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే జిల్లాలో కాంగ్రెస్ తరఫున రేవంత్‌రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బీఆర్‌ఎస్ తరఫున మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ లాంటి నేతలు ఇప్పటికే జిల్లాలో పర్యటించారు. ఇక రాహుల్‌గాంధీ, కేసీఆర్‌ల రాకకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

హోమ్ ఓటింగ్ షురూ

ఇళ్ల వద్దకే వెళ్లి రహస్య బ్యాలెట్ ద్వారా సేకరించిన అధికారులు



కొందుర్గు: ఓటు వేసిన వృద్ధురాలిని అభినందిస్తున్న చంద్రకాంత్

కొందుర్గు: పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోలేని స్థితిలో ఉన్న ఎనభై ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వారిని ఇదివరకే అధికారులు గుర్తించగా.. సోమవారం వారి ఇళ్ల వద్దకు వెళ్లి రహస్య బ్యాలెట్ ద్వారా వారి ఓటును వేయించి సీల్డ్ కవర్‌లో సేకరించారు. కొందుర్గు మండలంలో ఇలాంటి 58 మంది ఓటర్లను గుర్తించగా సోమవారం 17మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు సెక్టోరియల్ ఆఫీసర్లు ఆంజనేయులు, సింధూ తెలిపారు. మిగతావారి ఓట్లను మంగళవారం సేకరించేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 25మందిని గుర్తించగా మొదటిరోజునే అందరూ వారి ఓటుహక్కును వినియోగించుకున్నట్లు సెక్టోరియల్ ఆఫీసర్లు మహేష్‌బాబు, సుజాత, ఫసియా తెలిపారు. ఈ ప్రక్రియను సాధారణ కేంద్ర ఎన్నికల పరిశీలకులు చంద్రకాంత్ కృష్ణారావు డాగే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

కేశంపేటలో..

కేశంపేట: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి వయో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటుహక్కును వినియోగించుకునే కార్యక్రమాన్ని ఈసీ సోమవారం నుంచి ప్రారంభించింది. ఈ కార్యక్రమంల మంగళవారం కూడా కొనసాగనుంది. కేశంపేట మండలంలోని 52 మంది ఓటర్లకు గాను మొదటిరోజు 38 మంది ఇంటి వద్దనే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎంపీడీఓ, వ్యవసాయ అధికారి, ఇరిగేషన్ అధికారి మూడు టీంల ద్వారా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: శాసనసభ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ (040-23238545) కు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ భారతి హోలీకేరీ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను రికార్డ్ చేస్తారన్నారు. చేస్తూ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు తెలంగాణ శాసనసభ ఎన్నికలు-2023 కు సంబంధించి ఫిర్యాదులకై ఈ టోల్ ఫ్రీ నెంబర్ సంప్రదించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ కోరారు.

కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయములో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కంట్రోల్ రూమును సోమవారం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ భారతి హోలీకేరీ సందర్శించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మీడియా కేంద్రంలో రికార్డింగ్ను, ఎంసీఎంసీ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు.

కాంగ్రెస్ గెలిస్తే ఫార్మాసిటీ రద్దు

కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: కాంగ్రెస్ గెలిస్తే ఫార్మాసిటీని రద్దు చేసి సేకరించిన అసైన్డ్, పట్టా భూములు తిరిగి రైతులకే పంపిణీ చేస్తామని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి, తమ్మలోనిగూడ, చింతపట్ల, మల్కీజ్‌గూడ, నస్దిక్‌సింగారం, నందివనపర్తి, యాచారం గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కార్ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తోందన్నారు. భూసేకరణలోనూ అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు ఆరోపించారు. రైతుల పట్టా భూములను బలవంతంగా సేకరిస్తున్నారని మండిపడ్డారు.

ప్రచార పదనిసలు



ఓట్లకు కాంగ్రెస్ 'తాళం'

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి సోమవారం పట్టణంలో పర్యటించారు. ఓ ఆలయంలో భజన కార్యక్రమం జరుగుతుండగా అటుగా వెళ్లి కాసేపు తాళం వేసి భక్తులను సంతోష పరిచారు. హస్తం గుర్తుకే ఓటేసేలా మీ ఓట్లకు తాళం వేసుకుంటానంటూ సరదా సంభాషణ కొనసాగింది.



'చంటి' బిడ్డలా కాపాడుతాడు

ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ తాండూరు అభ్యర్థి సతీమణి ఆర్తిరెడ్డి ఓ చంటి బిడ్డను లాలించారు. ఈ సందర్భంగా ఆమె పైలెట్‌కు ఓటేయండి ప్రజలను చంటి బిడ్డలా కాపాడుకుంటారని చెప్పారు.



హస్తానికి వేస్తే 'ఆరు' గ్యారంటీ

కాంగ్రెస్ పరిగి అభ్యర్థి టీఆర్ఆర్ సతీమణి ప్రచారంలో దూసుకుపోతున్నారు. పూడూరు మండల పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ హస్తానికి ఓటేస్తే ఆరు గ్యారంటీలు వస్తాయంటూ వివరించారు.

పోటెత్తిన యువత

పది రోజుల క్రితం ప్రకటించిన ఓటరు లిస్టులో పెరిగిన ఓటర్లపై చర్చ ఊపందుకుంది. నూతనంగా ఓటు హక్కు వచ్చిన వారి పోలింగ్‌పైనే గెలుపోటముల ప్రభావం ఉంటుందని ప్రచారం సాగుతోంది. మరో తొమ్మిది రోజులు మాత్రమే పోలింగ్‌కు సమయం ఉండడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు తంటాలు పడుతున్నారు.

పెరిగిన ఓటర్లు ఎవరికి జై

- అంచనాలు వేస్తున్న విశ్లేషకులు
- మొదలైన కౌంట్‌డౌన్
- అభ్యర్థుల్లో టెన్షన్



పరిగి: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో వారం మాత్రమే ప్రచారం చేసేందుకు అవకాశం ఉంది. దీంతో అభ్యర్థులకు ప్రతీ రోజు కీలకంగా మారనుంది. ఇన్నాళ్లు ప్రచారం, ర్యాలీలు, ప్రసంగాలు, చేరికలపై ప్రత్యేక దృష్టి సారించిన పార్టీలు ఇప్పుడు గెలుపు వ్యూహాలకు పదునుపెడుతున్నారు. ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలను తిప్పకొడుతూ గెలుపు దిశగా అడుగులు వేయాల్సి ఉంటుంది. ఇప్పటికే అభ్యర్థుల్లో ఎన్నికల ఫీవర్ మొదలైంది. ఇప్పటికే విమర్శలు, ప్రతి విమర్శలతో స్వరం పెంచిన అభ్యర్థులు మాటల తూటాలతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇకపై ఎంత ప్రచారం, ఎంత డబ్బు ఖర్చు చేశామన్న దాని కన్న ఎంత మందిని తమవైపు తిప్పుకున్నమనేది ప్రధానం కానుంది. ఈ ఎన్నికల్లో పరిగి నియోజకవర్గంలో త్రిముఖ పోటీ కనిపిస్తోంది. ఎప్పుడు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ మధ్యలో ప్రధాన పోటీ ఉండేది కాని ఈ సారి బీజేపీ సైతం ఫైట్‌లో కనిపిస్తోంది. పరిగి అసెంబ్లీ స్థానానికి 28 మంది నామినేషన్లు దాఖలు చేయగా 11 నామినేషన్లను తిరస్కరించారు. దీంతో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్‌పీ పార్టీలతో పాటు పలు పార్టీలు, స్వతంత్రులతో కలపి మొత్తం 15 మంది బరిలో ఉన్నారు.

భారీగా పెరిగిన ఓటర్లు

నియోజకవర్గంలో మొత్తం ఏడు మండలాలు, ఒక మున్సిపాలిటీ ఉండగా మొత్తం 2,52,379 మంది ఓట్లు ఉన్నారు. ఎన్నికల సంఘం అక్టోబర్ వరకు కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించి ఈనెల 10న కొత్త లిస్టును విడుదల చేసింది. కొత్త ఓటరు లిస్టు ప్రకారం 2,59,422 మంది ఓటర్లు ఉండగా మొత్తం 7043 మంది కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. 2018 ఎన్నికలతో పోల్చుకుంటే దాదాపుగా 30వేల మంది ఓటర్లు పెరిగారు. వీరు ఎవరి వైపు ఉంటారనే అంచనాలు వేస్తున్నారు. ఈ ఓట్లు ఎక్కువగా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లనే నియోజకవర్గంలో చర్చ సాగుతోంది.

కండువాలు మార్చుతున్న నాయకులు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలో పలువురు నాయకుల చేరికల పర్వం కొనసాగుతుంది. అయితే ఎక్కువ శాతం బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరగా, కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. యువత మాత్రం ఎక్కువగా కషాయ కండువా కప్పుకున్నారు. ఇటీవల దోమ, కుల్కచర్ల ఎంపీపీలు అనసూయ, సత్య హరిశ్చందర్‌ల, పరిగి వైస్ ఎంపీపీ సత్య నారాయణ కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరారు. దోమ మండలంలో ఐదుగురు సర్పంచ్‌లు, కుల్కచర్ల మండలంలో నలుగురు సర్పంచ్‌లు మొత్తం నియోజకవర్గంలో పదుల సంఖ్యలో హస్తం చేయి అందించడంతో పార్టీ బలం పెరిగిందనే ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు, నిరుద్యోగ ఓటర్లు తమవైపే ఉన్నారని, ఆరు గ్యారంటీలు, ఇతర పార్టీలు నాయకుల చేరిక తమ గెలుపునకు దోహదం చేస్తుందనే భావనలో కాంగ్రెస్ శ్రేణులున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయనే ధీమాలో గులాబీ శ్రేణులు లెక్కలేసుకుంటున్నాయి. కేంద్రంలో ఉన్నతది తమ ప్రభుత్వమేనని తెలంగాణలోనూ సత్తా చాటుతామని కమళదళం కదం తొక్కుతోంది. ఏది ఏమైనా డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపుతోనే పూర్తి స్పష్టత రానుంది.

ఓడినా ప్రజల్లోనే ఉన్నారు

- నాన్నను ఆశీర్వదించండి
- కాంగ్రెస్ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య



రొంపల్లిలో ప్రచారం చేస్తున్న అనన్య

బంట్వారం: అమ్మను కోల్పోయాం.. అయినప్పటికీ మా నాన్న బాధను దిగమింగుతూ నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నారని కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య చేతన్ గద్గద స్వరంతో అన్నారు. సోమవారం ఆమె బంట్వారం మండల పరిధిలోని రొంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మా నాన్నకు నియోజకవర్గ ప్రజలకే కుటుంబ సభ్యులు.. ఆయన రెండుసార్లు ఓడినా పదేళ్లుగా ప్రజల మధ్యే ఉంటున్నారని గుర్తు చేశారు. అర్ధరాత్రి ఫోన్ చేసినా ఆపదలో ఉన్నామంటే వెంటనే పరుగెత్తుకుని వచ్చే ఆయన్ను ఈ ఎన్నికల్లోని దీవించాలని కోరారు. ఓట్లను కొనేందుకు తిరుగుతున్న గులాబీ నేతలను తరిమి కొట్టాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు పంచే అవినీతి సొమ్మును తీసుకుని చేతి గుర్తుకు ఓటేసి ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మా నాన్న మంత్రిగా ఉన్న సమయంలో వేసిన రోడ్ల పై తిరుగుతున్న ప్రస్తుత పాలకులు తట్టెడు మట్టి వేయించలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోతో పాటు ఆరు గ్యారంటీలు అమలవుతాయన్నారు. కేసీఆర్ మాయ మాటలకు మరోసారి మోసపోవద్దన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పాలనను మరి కొద్దిరోజుల్లో చూస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటేశం, మహిళా విభాగం అధ్యక్షురాలు స్వరూప, నాయకులు పురుషోత్తంరెడ్డి, అంజిరెడ్డి, సంగమేశ్వర్, రాధాకృష్ణగౌడ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు అజీమ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంలాంటి రోడ్లు.. అంతర్గత కాల్వలు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జనం

- అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే
- ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ షాద్‌నగర్ అభ్యర్థి అంజయ్య యాదవ్

నందిగామ: గ్రామాల్లో అద్దం లాంటి సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు నిర్మించి పట్టణాలకు తీసిపోని విధంగా పల్లెలను తయారు చేశామని షాద్‌నగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్య యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన మండల పరిధిలోని చర్ల అంతిరెడ్డిగూడ, వీర్లపల్లి, మొదళ్లగూడ, మామిడిపల్లి, శ్రీనివాసులగూడ, ఈదులపల్లి, మోత్కులగూడ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సన్మానించగా.. మహిళలు హారుతులు పట్టి స్వాగతించారు. అనంతరం ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర ఏళ్లలో సీఎం కేసీఆర్ కృషితో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. అన్నదాతలకు భరోసా కల్పించిన ప్రభుత్వం బీఆర్‌ఎస్‌దే అన్నారు. కాంగ్రెస్ పాలనలో మనకు ఒరిగిందేమీ లేదని మీ కళ్ల ముందు జరిగిన అభివృద్ధి మరింత కొనసాగాలంటే మరోసారి కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నాగరకుంట నవీన్ రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్న లత, పీఏసీఎస్ చైర్మన్లు అశోక్, మంజుల రెడ్డి, మాజీ చైర్మన్ విఠల్, సర్పంచులు ఉమాదేవి, స్వామి, కవిత, ఎల్లమ్మ, అశోక్, ఎంపీటీసీ మాధవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు బేగ్, నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎమె సత్యనారాయణ, గణేష్, రఘు, కాట్న శ్రీశైలం, వీరేందర్ గౌడ్, జంగిలి కుమార్, గోవిందు శేఖర్, కాట్న శేఖర్, జెల్ల శంకరయ్య, కొండన్నగూడ సత్యం, జెగ్గ రాజేందర్, మాజీ సర్పంచ్ నీలమ్మ, ముత్యాల నర్సింహులు, పట్వారీ శ్రవన్ కుమార్, జ్ఞానేశ్వర్, రవీందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికే ఓటేయండి

పరిగి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్‌రెడ్డి



దాదాపూర్‌లో మాట్లాడుతున్న మహేశ్ రెడ్డి

దోమ: అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలు కారు గుర్తుకే ఓటేయాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కొత్తపల్లి, గుండాల, దాదాపూర్, మల్లేపల్లి, బడేంపల్లి, కొండాయపల్లి, దిర్సంపల్లి, బట్లచందారం, గంజిపల్లి, దిర్సంపల్లితండా గ్రామ పంచాయతీల్లో ప్రజా ఆశీర్వాద పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో ఆయా గ్రామాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేరుగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కరెంటు కావాలో? కాంగ్రెస్ పార్టీ కావాలో? ఆలోచించుకోవాలన్నారు. మూడు గంటల కరెంటు కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, 24 గంటల కరెంటు కావాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని ప్రజలకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీల పేరిట మోసం చేసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు.

దాదాపూర్ మండల కేంద్రం ఏర్పాటు?

ఈ సార్వత్రిక ఎన్నికల్లో తాను విజయం సాధిస్తే దాదాపూర్ మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తానని మహేశ్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో మహిళలకు డ్వాక్రా భవనాలను నిర్మిస్తామన్నారు. దిర్సంపల్లి నుంచి రంగారెడ్డిపల్లి వరకు డబుల్ రోడ్డు, దాదాపూర్ తండాకు బీటీ రోడ్డు వేయిస్తామన్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రభుత్వ భూములు ఉన్న రైతులకు భూములు క్రయ, విక్రయాలు చేసుకోవడానికి వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, మాజీ ఎంపీపీ రాజగోపాల చారి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాజిరెడ్డి, కవిత, శాంత, రాములు, అంజిలయ్య, కల్పన, యాదయ్యసాగర్, ఎంపీటీసీ సభ్యులు రాములు, నర్సింహులు, దామోదర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు రఫీక్‌పాష, శిరీష, పార్టీ సీనియర్ నేతలు రాఘవేందర్‌రెడ్డి, షఫీ, మోహిన్ పాష, గౌసుద్దీన్, మధుసూదన్‌రెడ్డి, జగత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు రావడం లేదు సార్

దాదాపూర్ తండాకు వెళ్లిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని తండా వాసులు సమస్యలతో చుట్టుముట్టారు. తమ తండాకు తాగునీరు రావడం లేదని మహేశ్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. సర్పంచ్‌కి, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు గుంతల మయంగా మారిందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఎన్నికలు పూర్తైన వెంటనే బాగుచేసే బాధ్యత నాదే హామీ ఇచ్చారు.

ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలి

కేంద్ర ఎన్నికల పరిశీలకులు చంద్రకాంత్ కృష్ణారావు డాంగే



కొందుర్గులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీకే డాంగే

కొందుర్గు: ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సాధారణ కేంద్రం ఎన్నికల పరిశీలకులు చంద్రకాంత్ కృష్ణారావు డాంగే అధికారులకు సూచించారు. సోమవారం ఆయన సమస్యాత్మక గ్రామాల పరిశీలనలో భాగంగా మండల పరిధిలోని రేగడిచిల్కమర్రి, ముట్పూర్, మహదేవ్‌పూర్, కొందుర్గు, తంగెళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్ జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లి, ఇంద్రానగర్ తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో గాలి, వెలుతురు, ర్యాంపు సౌకర్యం, టాయిలెట్ తదితర వసతులు ఉన్నాయా లేదో తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో ఆయా మండలాల తహసీల్దార్లు రమేశ్‌కుమార్, విజయ్‌కుమార్, ఎంపీఓలు లాలయ్య, విజయ్‌కుమార్ పాల్, ఎంఆర్‌ఐలు శివ, మహేందర్ సర్వేయర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డి గెలుపునకు పాదయాత్ర



పగిడియాల నుంచి సంగమేశ్వర ఆలయానికి కాంగ్రెస్ నేతల పాదయాత్ర

యాలాల: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి వెంటే తాండూరు ప్రజానీకం ఉన్నారని పగిడియాల, బాగాయిపల్లి కాంగ్రెస్ నేతలు అన్నారు. సోమవారం మనోహర్‌రెడ్డి గెలుపు కోరుతూ పగిడియాల నుంచి కోకట్ సంగమేశ్వరాలయం వరకు పార్టీ శ్రేణులు పాదయాత్రగా చేపట్టారు. సుమారు వంద మందికి పైగా నాయకులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కాంగ్రెస్ నినాదాలు చేస్తూ పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలు ఆకర్శితులు అవుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. అనంతరం కోకట్ సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పాదయాత్రలో పగిడియాల ఉప సర్పంచ్ నర్సింహులుగౌడ్, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రఘురాంరెడ్డి, కాలప్ప, కుర్వ సంఘం అధ్యక్షుడు గవ్వల శేఖర్, గోపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, దేవనూరు శ్రీనివాస్‌రెడ్డి, మల్లప్ప, బుగ్గయ్య, తదితరులున్నారు.

ఏడాదిలోనే ఎంతో అభివృద్ధి చేశా

బీఆర్‌ఎస్ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డి



అంతారంలో పైలట్ రోహిత్‌రెడ్డి ప్రచారం

తాండూరు రూరల్: నీను చస్తే తాండూరులోనే బొంద పెడ్తారని.. నాన్ లోకల్ వాళ్లను నమ్మి మోసపోవద్దని తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని నారాయణపూర్, వీరశెట్టిపల్లి, గోనూర్, బిజ్వార్, ఖాంజాపూర్, అంతారం, అంతారం తండా, చెన్‌గేస్‌పూర్, ఎల్మకన్నె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పైలట్ మాట్లాడుతూ.. ఏడాదిలోనే నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని గుర్తుచేశారు. మరోసారి అవకాశం కల్పిస్తే తాండూరును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. కేసీఆర్ మరోసారి గెలిస్తే మహిళలకు సౌభాగ్య లక్ష్మీ కింద రూ.3 వేలు, గ్యాస్ సిలిండర్ రూ.400, పెన్షన్లు రూ.5 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, రైతుబంధు ఎకరాకు రూ.16 వేలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గౌడి మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపా రెడ్డి, సర్పంచ్‌లు చంద్రప్ప, నాగప్ప, గోవింద్, నరేందర్ రెడ్డి, రాములు, సావిత్రి, రాములమ్మ, ఎంపీటీసీ సభ్యులు నర్సమ్మ, శాంతు, నాయకులు ఉమా శంకర్ పటేల్, రాజప్ప, మాధవరెడ్డి, నరేందర్‌రెడ్డి, వాసు పవార్ నాయక్, కేశవ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రకాశ్, జీవరత్నం, శ్రీను పాల్గొన్నారు.